క్లుప్తంగా

నేడు చంద్రశేఖర స్వామికి అభిషేకాలు



చంద్రేడులోని చంద్రశేఖర స్వామివారు

రంగంపేట: మాస శివరాత్రి సందర్భంగా చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కష్టశర్మ తెలిపారు. తెల్లవారుజామున నాలుగు నుంచి అభిషేకాలు మొదలవుతాయని చెప్పారు. అనంతరం స్వామివారిని విశేష అలంకరణలు చేసి, ప్రత్యేక పూజలు చేయనున్నట్టు తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకుని 14న జ్యోతి ప్రజ్వలన, బాలల దినోత్సవం సందర్భంగా గేయాలు, 15న పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం, 16న వ్యాసరచన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 17న దేశభక్తి, జానపద గేయాలు, 18న వక్తృత్వం, 19న మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు, అక్షరాస్యతా దినోత్సవం, బహుమతి ప్రదానం ఉంటాయని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం హెచ్ఎం వి.పార్థసారథి వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి



పాత వెలుగుబందలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో మహిళల రక్షణతో పాటు వారి సాధికారత, సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కొత్త వెలుగుబంద, పాత వెలుగుబంద గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో మహిళలకు ఇచ్చిన, ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. వివిధ రకాల సంక్షేమ పథకాలే కాకుండా రికార్డు స్థాయిలో 31.5 లక్షల మందికి పంపిణీ చేసిన నివాస స్థలాల పట్టాలను కూడా మహిళల పేరుతోనే అందజేశారన్నారు. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ చట్టాన్ని తీసుకురావడంతోపాటు దిశ పోలీసు స్టేషన్లు కూడా ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాక గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను కూడా తెలియజేశారు. ప్రతి మహిళ ఆర్థికంగా ప్రగతిని సాధించాలనే తలంపుతో పనిచేస్తున్న జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడం బాధ్యతగా ప్రతి మహిళ గుర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేసి, మహిళల ప్రగతికి బాటలు వేద్దామన్నారు. సమావేశంలో వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

729 మందికి వైద్య పరీక్షలు

రాజానగరం: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా శుక్రవారం దివాన్‌చెరువు గ్రామ సచివాలయం 4 (శ్రీరామపురం) వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 729 మందికి వైద్య పరీక్షలు చేశారు. వాటిలో 232 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బెనిడిక్, శ్రీవాణి, సీహెచ్ఓ మేరీహెబ్సి, హెచ్ఎస్ ఎంయూకే సుబ్రహ్మణ్యేశ్వరరావు, టీబీ సూపర్‌వైజర్ శేషు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: పాత వీరంపాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎస్ఈబీ అధికారులు దాడి చేసి వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగులపల్లి గంగరాజును 20 లీటర్ల సారా, వంద లీటర్ల బెల్లపు ఊటతో అరెస్టు చేశారు. ఎస్ఈబీ ఎస్సై శేఖర్‌బాబు, సిబ్బంది దాడిలో పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

- వేడుకలా 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం
- పథకాల వివరాలతో డిజిటల్ బోర్డుల ఆవిష్కరణ

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం శుక్రవారం లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని సచివాలయం-1లో జరిగింది. వారు మాట్లాడుతూ ఇచ్చిన మాటను నెరవేర్చడమే సీఎం జగన్‌కు తెలుసునన్నారు. పార్టీ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 650 వరకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను ముఖ్యంగా రైతులు, డ్వాక్రా మహిళలను ఏవిధంగా బురిడీ కొట్టించారో మననం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో జగన్ సర్కారు అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికలలో మరోసారి జగన్ సర్కారును అధికారంలోకి తీసుకువచ్చేలా తీర్పునివ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయంలో వివిధ సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు, గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలతో బోర్డులను 'నువ్వే మా నమ్మకం జగనన్న' పేరిట ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వి.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి ఎ.శ్రీనివాసరావు, మురళీ, మాజీ సర్పంచ్ మెట్ల ఏసుపాదం, వేమగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్నతోనే అభివృద్ధి

అనపర్తి: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి.. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం సీఎం జగనన్నతోనే సాధ్యమని అన్నారు. అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా అవినీతిరహితంగా, పార్టీలకతీతంగా గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలకు మోసపోకూడదన్నారు. రాష్ట్రానికి సీఎం జగనన్న అవసరం ఎంతో ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, గ్రామాభివృద్ధి పనుల బోర్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి బుల్లిమోహన్‌రెడ్డి, జేడీఎస్ ఇన్‌చార్జి చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ పోతంశెట్టి మంజు కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు తాడి సూరారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి సర్రెడ్డి, ఉపసర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కొప్పవరంలో పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, నాయకులు

పుట్టకొండలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెదపూడి: పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పుట్టకొండ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ పథకాలతో ఎంత మంది లబ్ధి పొందారో వివరాలు తెలిపే బోర్డును సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. వలంటీరు ఇంటింటికీ తిరిగి పథకాల వివరాలు సేకరించారు. సర్పంచ్ వల్లు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, గ్రామ కన్వీనర్ మేడిశెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ పేపకాయల వెంకటరమణ, పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

బిక్కవోలు: మండల కేంద్రమైన బిక్కవోలు సచివాలయం-2లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత +ఎంపీపీ జ్యోతిర్మయి శేషుకుమారి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బిక్కవోలు సచివాలయం-2 పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రూ.32,44,48,586 లబ్ధి అందించినట్టు వివరించారు. మధ్యవర్తులు, దళారులు లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలు దక్కాలంటే ఆంధ్రప్రదేశ్‌కి జగనే సీఎం కావాలని వివరించారు. అనంతరం స్థానిక కొత్తపేట వద్ద కొత్తగా నిర్మిస్తున్న సచివాలయం-2 వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రొంగల పద్మావతి, సర్పంచ్ సరెళ్ల సుమలత, ఉప సర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బుద్ధాల కన్నారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరి సత్తిబాబు, రొంగల అప్పాజీ, బొద్దు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు పెద వెంకన్న



పుట్టకొండలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



బిక్కవోలులో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జ్యోతిర్మయి శేషుకుమారి

ఘనంగా సత్కారం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం సెంటర్‌లోని రాజరాజేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డిని సత్కరించారు. ఆయన ఇటీవల అమ్మవారి ఆలయానికి మైక్ సెట్‌ను బహూకరించారు. అలాగే బీజేపీ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరిని కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ ధర్మకర్త నీరుకొడ బాబ్జీ, కమిటీ నాయకులు కనుబొజ్జి సూర్యచంద్రం, కాలచర్ల శ్రీను పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేం



గోకవరంలో ర్యాలీ చేస్తున్న అటవీ రక్షణ శాఖ పోలీస్ సిబ్బంది

గోకవరం: అటవీ రక్షణ శాఖలో పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల త్యాగాలు మరువలేమని ఇందుకూరుపేట రేంజ్ ఎఫ్ఆర్ఓ దుర్గాకుమార్ అన్నారు. గోకవరంలో శుక్రవారం అటవీ రక్షణ శాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. గోకవరం రేంజ్ కార్యాలయం నుంచి థానా సెంటర్ వరకూ పోలీస్ సిబ్బంది ర్యాలీ చేశారు. అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా దుర్గాకుమార్ మాట్లాడుతూ గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఐఎఫ్‌సీ అధికారి పందెల్లపల్లి శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఏటా ఇందుకూరుపేట రేంజ్‌లో నవంబర్ 10న అటవీ రక్షణశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శ్రీనివాస్ సేవలను కొనియాడారు. అటవీ, పోలీస్ సిబ్బంది పి.రాజ్యలక్ష్మి, శేఖర్ బాబు, పి.శ్యాంకుమార్, హరీశ్వర్, పి.వీరన్నదొర, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల చొరవతో సద్దుమణిగిన ఆందోళన

రంగంపేట: జి.దొంతమూరులో శ్మశాన వాటిక ఏర్పాటుపై శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఓ రైతు చూపించిన ప్రత్యామ్నాయ స్థలం ఊరి మధ్యలో ఉండడంతో వివాదం తలెత్తింది. పోలీసు, రెవెన్యూ అధికారుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. పూర్వపు శ్మశానంలోనే అంత్యక్రియలు జరపాలని అధికారులు తేల్చారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక జీబీఆర్ క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు జరిగే జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఇంట్రా స్కూల్ క్రీడా పోటీలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు, వారిలో క్రీడాస్ఫూర్తి నింపేందుకు ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. సీఐ పి.శివగణేష్, ఎస్సై జగన్‌మోహన్‌రావు తదితరులు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడాకారులకు అందించారు. వంద మీటర్ల పరుగును సీఐ శివగణేష్, క్రికెట్‌ను ఎస్సై జగన్‌మోహన్‌రావు ప్రారంభించారు. స్కూళ్ల డీన్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల పాలకవర్గ సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి, జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ గొలుగూరి జగన్నాథరెడ్డి, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్‌వీ అబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి, డైరెక్టర్లు డీవీఆర్‌పీ పాపిరెడ్డి, కె.హరినాథరెడ్డి, ఎం.ఉమావెంకటరెడ్డి, పీడీ ఎంవీవీ రామారెడ్డి(మహేంద్ర) పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి పరీక్షలు



కొంకుదురులో చెకుముకి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: విద్యార్థుల్లో బాల్యం నుంచి శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి శ్లాఘనీయమని కొంకుదురు హైస్కూల్ హెచ్ఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. జేవీవీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ మండలంలోని కొంకుదురు, ఊలపల్లి, పందలపాక, మెళ్లూరు, ఇల్లపల్లి గ్రామాల్లోని హైస్కూళ్లకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరెడ్డి, సుధాకరరెడ్డి, రాజశేఖర్, వెంకట్రావు, జ్యోతి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- పుణ్యక్షేత్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి, ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తోడ్పడుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని పుణ్యక్షేత్రంలో నాలుగో రోజైన శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఏ కుటుంబంలో ఎవరెవరికి ఏఏ పథకాల ద్వారా ఏమేరకు ప్రయోజనం చేకూరిందో వివరిస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. భూపాలపట్నం ఎస్‌బీఐ బ్రాంచ్ సమీపంలో తలెత్తిన డ్రైనేజీ సమస్యతో ఆయా ప్రాంతంలోని వారు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముందుగా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మురుగు నీరు రోడ్డు పైకి చేరిన విషయాన్ని గ్రహించి, సంబంధిత అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, పుణ్యక్షేత్రం, సంపత్ నగరం గ్రామ సర్పంచ్‌లు మరుకుర్తి వెంకటేశ్వరరావు, పెంటగట్ల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పలివెల వెంకట్రావు, నాయకులు పేపకాయల రాంబాబు, శ్రీధర్, ఈశ్వరరావు, పోతురాజు, వీరబాబు, దుర్గారావు పాల్గొన్నారు.



పుణ్యక్షేత్రంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఎమ్మెల్యేకు ఆక్వా రైతుల సన్మానం

పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపూడిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆక్వా రైతులు

పెదపూడి: నిబంధనల ప్రకారం ఆక్వా సాగు చేసుకోడానికి నిస్వార్థంగా సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి తామంతా అండగా ఉంటామని పలువురు ఆక్వా సాగు రైతులు ప్రకటించారు. పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 200 ఎకరాల ఆక్వా సాగును రైతులు చేపట్టారు. వారికి నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే సహకరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక ఎకరా చేపల చెరువు తవ్వుకోవడానికి రూ.2 లక్షల వరకూ మామూళ్లు వసూలు చేసే వారంటూ, నీతికి నిజాయితీకి మారుపేరైన ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఒక్క రూపాయి తీసుకోలేదని పలువురు రైతులు చెప్పారు. అనంతరం రైతులు ఈదేటి రామకృష్ణ, కొంగర పాపారావు, మార్ని మార్కండేయ, కొంగర శ్రీను, నిమ్మలపూడి రాజాబ్బాయితో పాటు మరి కొందరు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, జ్ఞాపికను సమర్పించి, గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి చరిత్రలో ఎన్నడూ, ఏ ముఖ్యమంత్రి చేయని అనేక సంక్షేమ పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు.

ఐదో రోజూ ఎమ్మెల్యేకు సన్మానాల జోరు

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆయనకు ఐదో రోజూ సన్మానాల జోరు కొనసాగింది. నాలుగు రోజులుగా ఎమ్మెల్యేకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పడుతూ, పెద్దఎత్తున హారతులిచ్చారు. అలాగే మహిళలు తమకు ఇళ్ల స్థలాలు, ఇంటి రుణం ఇచ్చారని, చేయూత, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు పొందామంటూ ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, చేనేత విభాగం మండల కన్వీనర్ తిప్పాన వెంకటరమణ, మరడా పెద్ద సత్తిబాబు, పల్లంకి శివ, పంపన రమణ పాల్గొన్నారు.

బాబా ఆలయానికి ఫ్యాన్ల వితరణ

మధురపూడి: కోరుకొండ పెట్రోలు బంకు సమీపంలోని సాయిబాబా ఆలయానికి రాజానగరం మండలం నందరాడకు చెందిన రామప్రభ శుక్రవారం తొమ్మిది ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

మధురపూడి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయాలని తహసీల్దార్ పాపారావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం మీటింగ్ హాలులో శుక్రవారం వ్యవసాయ శాఖ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ప్రయాస లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు 2,25,000 గోనె సంచులు వచ్చాయని, ఇంకా 1,75,000 రావాల్సిందన్నారు. మండలంలోని 15 రైస్ మిల్లులకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అమ్ముకునే సౌలభ్యం ఉందన్నారు. సమావేశంలో కాపవరం సర్పంచ్ జాజుల రాము, వ్యవసాయ శాఖ మండలాధికారి గౌరీదేవి, ఎంఎస్ఓ సునీత, రైతు నాయకులు కాలచర్ల చిన్నారావు, గిద్దా సత్యనారాయణ పాల్గొన్నారు.